సాక్షి
సిద్దిపేట
ఆదివారం । 19 । నవంబర్ । 2023



ఏం చేశారని..

దుబ్బాకకు రావాల్సిన నిధులు రాకుండా అడ్డుకున్న హరీశ్‌రావుకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు ఆరోపించారు. వివరాలు 10లో ▸



ప్రజల గొంతు నేనవుతా..

నన్ను గెలిపిస్తే అసెంబ్లీలో హుస్నాబాద్ గొంతు వినిపిస్తానని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ అన్నారు. వివరాలు 11లో ▸



సకుటుంబ సమేతంగా..

అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. మద్దతుగా కుటుంబ సభ్యులు సైతం ప్రచారంలో విస్తృతంగా పాల్గొంటున్నారు. వివరాలు 11లో ▸





చేర్యాల ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సభకు హాజరైన ప్రజలు

నెల రోజుల్లో చేర్యాల డివిజన్

- ఈ ప్రాంతంతో నాకు ప్రత్యేక అనుబంధం
- చేర్యాల పట్టణ కేంద్రంలో హిందీ విశారద చదివాను
- పల్లాను భారీ మెజార్టీతో గెలిపించాలి
- హామీలన్నీ నెరవేర్చే బాధ్యత నాది
- ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

చేర్యాల(సిద్దిపేట): పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే నెల రోజుల్లో చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తానని, చేర్యాలతో తనకు ప్రత్యేకమైన అనుబంధముందని, పల్లాను గెలిపిస్తే తాను అడిగిన హామీలన్ని నెరవేరుస్తానని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చేర్యాల పట్టణ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వెనుక గ్రౌండ్‌లో శనివారం జనగామ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరై ప్రజలనుద్దేశించి మాట్లాడారు. తాను హిందీ విశారద పట్టణ కేంద్రంలోని ఓ మాస్టారు వద్ద చదివానన్నారు. తనకు ఇక్కడ చాలా మంది రారా పోరా అని పిలిచే చిన్ననాటి స్నేహితులు ఉన్నారని పాత జ్ఞాపకాలను గుర్తు చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల గుణగనాలు, తన చరిత్ర, పార్టీ చరిత్రను చూసి వజ్రాయుధం లాంటి ఓటును సొంత విచక్షణతో వినియోగించుకోవాలన్నారు.

తెలంగాణ రాకుండా కుట్రలు

బీఆర్‌ఎస్ రాష్ట్ర సాధన, హక్కుల కోసం పుట్టిందన్నారు. తొలి, మలి దశ ఉద్యమాల్లో మోసం చేసింది కాంగ్రెస్సే అన్నారు. తెలంగాణ రాకుండా చాలా కుట్రలు చేశారని, కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ శవయాత్రనా.. తెలంగాణ జైత్ర యాత్రనా.. అని చావు నోట్లో తలపెట్టి రాష్ట్రం సాధించుకున్నామన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం కరెంటు, నీళ్లు తెచ్చింది ఎవరో.. మాయ మాటలు చెప్పేది ఎవరో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్ర సంపద పెరిగింది కాబట్టే రూ.2 వేల పెన్షన్ అందిస్తున్నామని, మళ్లీ గెలిచాక రూ.5 వేలకు పెంచుతామని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నో సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు.

స్థానికంగా పరిశ్రమల ఏర్పాటు

ఎన్నికల పర్యటనలో భాగంగా హెలికాప్టర్‌లో పర్యటిస్తుంటే రాష్ట్రమంతటా ధాన్యం కుప్పలు కనిపిస్తున్నాయన్నారు. ఎన్నికల్లో గెలుపొందాక రైతుబంధు ఎకరాకు రూ.16 వేలు అవుతుందన్నారు. కాంగ్రెస్ గెలిస్తే ఉన్నది పోతుందని, ధరణి తీసేస్తానంటున్నారని విమర్శించారు. సిద్దిపేట, జనగామతో పాటు జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఏడాదికి 10 వేల మంది వైద్యులను తయారు చేసే స్థాయికి రాష్ట్రం ఎదిగిందన్నారు. పల్లాను గెలిపిస్తే ఇంతకు రెట్టింపు అభివృద్ధి చేయడంతో పాటు స్థానికంగా పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

సీఎం చలోక్తులు

సభా వేదికపైకి కేసీఆర్ అడుగుపెట్టగానే పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున జై తెలంగాణ, జై కేసీఆర్ అని నినాదాలు చేశారు. సభలో భాగంగా సీఎం తనదైన శైలిలో మాటల తూటాలు వదిలారు. చేర్యాలలో సభ పెడితే చాలన్నడు ఇప్పుడు ఇవన్నీ అడుగుతుండని చెబుతూ 'దొడ్లకు వచ్చిన గేదె పెండ పెట్టకుండా పోతుందా' అంటూ నేను వచ్చాను కదా ఇక అడిగినవన్నీ కచ్చితంగా నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. సాయి సంసారి లచ్చి దొంగ, కాకరకాయ తోక మాటలు చాలా మాట్లాడుతుంటారని ప్రతిపక్షాలను ఉద్దేశించి సీఎం తనదైన శైలిలో విమర్శించారు.

కేసీఆర్ వెంటే జనగామ..

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఉవ్వెత్తున ఎగిసిపడ్డ తెలంగాణ ఉద్యమంలో చేర్యాల, జనగామ ప్రాంతమంతా కేసీఆర్ వెంట నడిచిందని జనగామ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. చేర్యాల ప్రాంతంలో కేసీఆర్‌కు చాలా మంది చిన్ననాటి మిత్రులున్నారని, ఈ ఎన్నికల్లో ఆయన్ని మూడోసారి సీఎం చేసేందుకు అంకిత భావంతో ఉన్నారన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్, ఫైర్ స్టేషన్, మినీస్టేడియం, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండల కేంద్రాల్లో ప్రభుత్వ శాఖల కోసం ఇంటిగ్రేటెడ్ భవనాల నిర్మాణం చేపట్టాల్సి ఉందని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఈ పనులన్నీ పట్టాలెక్కుతాయన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీళ్లు తెచ్చాం, మల్లన్నసాగర్ రిజర్వాయర్ల పరిధిలో మిగిలిన డిస్ట్రిబ్యూషన్ కాల్వల నిర్మాణ పనులు పూర్తి చేసి, ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేని విధంగా జనగామ నియోజకవర్గంలో ప్రతీ ఏటా 3.5లక్షల టన్నుల ధాన్యం దిగుబడివస్తుందన్నారు. చేర్యాల పట్టణంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉంది, దీనికి తోడుగా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని సీఎంని కోరామని తెలిపారు. కేసీఆర్ దయతలచి టికెట్ ఇస్తే గెలిచిన ప్రతాప్‌రెడ్డి ఇప్పటికీ నాలుగు పార్టీలు మారాడని, అలాంటి వ్యక్తికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు.

ఆరుతడి సాగే లాభదాయకం

తోర్నాల పరిశోధనా స్థానం హెడ్ శాస్త్రవేత్త శ్రీదేవి



పత్తి పంట క్షేత్ర సందర్శనలో రైతులు, శాస్త్రవేత్తలు

సిద్దిపేటరూరల్: యాసంగి కాలానికి ఆరుతడి పంటల సాగు అనుకూలమైందని తోర్నాల పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త , హెడ్ డా.శ్రీదేవి రైతులకు సూచించారు. శనివారం తోర్నాలలోని పరిశోధనా స్థానం, ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో యాసంగికి అనుకూల ఆరుతడి పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డా.ఎస్. శ్రీదేవి మాట్లాడుతూ రైతులు యాసంగిలో వరికి బదులుగా ప్రొద్దుతిరుగుడు, మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము, కూరగాయలు వంటి పంటల సాగు లాభదాయకమన్నారు. రబీలో సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు పెసర, మినుము, కంది, ఆముదం పంటలను విత్తుకోవచ్చన్నారు. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు వేరుశెనగ, శనగ, మొక్కజొన్న, తీపిమొక్కజొన్న, రాగులు, ఆవాలు, కుసుమ, పంటలను విత్తుకోవచ్చన్నారు. శాస్త్రవేత్తలు డా. త్రిజయ, డా. ఉమారాణి, సీ.హెచ్.పల్లవి, డా.శ్వేత, బుస్సాపూర్, తోర్నాల, చిట్టాపూర్, మెట్టు, పోతారం, అన్నాపూర్ గ్రామ రైతులు పాల్గొన్నారు. అలాగే వ్యవసాయ పరిశోధన స్థానంఏరువాక కేంద్రం, తోర్నాలలో యాంత్రిక పద్ధతిలో నాటిన అధిక సాంద్రత పత్తి సాగుపై శనివారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.

ప్రజా నాయకుడు హరీశ్‌రావు

మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రజల సంక్షేమం కోసం అనునిత్యం తపించే నాయకుడు మంత్రి హరీశ్‌రావు అని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు అన్నారు. సిద్దిపేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థి హరీశ్‌రావుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 2వ వార్డు హనుమాన్ నగర్ లో ఎంబీసీ కులాలలో ఒకటైన మొండి బండ కుల సంఘం సభ్యులు తమ ఓట్లు అన్నీ హరీశ్ రావుకే అంటూ మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని రాజనర్సుకు అందించారు. కార్యక్రమంలో ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షుడు కర్ణం రమేశ్, పట్టణ కుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, సంఘం, బీఆర్‌ఎస్ నాయకులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు. హరీశ్‌రావు భారీ మెజార్టీతో విజయం సాధించాలని పట్టణంలోని అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, రెండవ వార్డు నర్సాపూర్‌లో స్థానిక కౌన్సిలర్ చంద్రంతో కలిసి పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి ప్రచారం నిర్వహించి, సిద్దిపేట అభివృద్ధి మీద రూపొందించిన ప్రగతి పుస్తకాలు పంపిణీ చేశారు.

నేడు, రేపు హోమ్ పోలింగ్

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

దుబ్బాక: హోమ్ పోలింగ్‌కు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, 80 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఆది, సోమవారం రెండు రోజుల పాటు హోమ్ పోలింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్, దుబ్బాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి గరిమా అగర్వాల్ అన్నారు. శనివారం దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. హోమ్ పోలింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వారు ఆది, సోమవారాలలో ఇంటి వద్దే ఉండి తమ ఇంటికి వస్తున్న హోమ్ పోలింగ్ అధికారులకు సహకరించి ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ జరిగేలా ఏఆర్‌ఓలు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

నోటీసులు జారీ చేయండి

సిద్దిపేటజోన్: ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆయా పార్టీల, స్వతంత్ర అభ్యర్థులు ఎప్పటికప్పుడూ ఎన్నికల ఖర్చు వివరాలు అందజేయాలని, వ్యయ లెక్కలు చూపని వారికి నోటీసులు జారీ చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు వెంకా దేశ్‌బాబు రిటర్నింగ్ అధికారి సురేశ్ బాబుకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయాన్ని సందర్శించారు. పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ తరఫున ఎన్నికల ఏజెంట్లు లెక్కలు చూపించారు. హాజరుకాని అభ్యర్థులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు.

సందేహాలు నివృత్తి చేసుకోండి

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- రెండు రోజులపాటు మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, పక్కన మన్మోహన్ ప్రసాద్, జయశ్రీ ఎస్ బోజ్

సిద్దిపేటరూరల్: జిల్లాలోని క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అబ్జర్వర్లు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆధ్వర్యంలో జనరల్ అబ్జర్వర్ జయశ్రీ ఎస్. భోజ్ (ఐఏఎస్)హుస్నాబాద్-32, సిద్దిపేట-33, జనరల్ అబ్జర్వర్ మన్మోహన్ ప్రసాద్ (ఐఏఎస్)దుబ్బాక-41, గజ్వేల్-42 సమక్షంలో జిల్లాలోని క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు నియమించిన మైక్రో అబ్జర్వర్లకు జిల్లా మాస్టర్ ట్రైనింగ్ అధికారులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతోపాటు మీరు కూడా భాగస్వాములని అన్నారు. ఇచ్చిన పీపీటీ బుక్‌ను క్షుణ్ణంగా చదవి అర్థం చేసుకోవాలన్నారు. రెండు రోజులపాటు శిక్షణ తరగతుల్లో ప్రతీ ఒక్క మైక్రో అబ్జర్వర్ పాల్గొని మాస్టర్ ట్రైనర్ తెలిపిన విధంగా ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవాలన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్, మైక్రో అబ్జర్వర్ నోడల్ ఆఫీసర్ సత్యజిత్, ఎలక్షన్ సూపరింటెండెంట్ రామేశ్వర్ పాల్గొన్నారు.

ఓటర్ సమాచార చీటీల అందజేత

జిల్లా వ్యాప్తంగా బీఎల్‌ఓల ద్వారా ఇంటింటికీ ఓటర్ సమాచార చీటీని అందిస్తున్నట్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రధాన ఎన్నికల అధికారి తెలంగాణ జారీ చేసిన ఓటరు అవగాహన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్‌కు సంబంధించిన అన్ని వివరాలతో కూడిన చీటీని బీఎల్‌ఓలు అందిస్తున్నారన్నారు. ఒక వేళ ఓటర్ సమాచార చీటీ అందకుంటే 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు గానీ, బీఎల్‌ఓలను గానీ సంప్రదించాలన్నారు. ఓటర్ సమాచార చీటీతోపాటు ఓటర్ అవగాహన కరపత్రాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు. చీటీలో ఓటరు నియోజకవర్గం, గ్రామం, పోలింగ్ కేంద్రం, ఓటర్ ఐడీ కార్డు నంబర్, ఎన్నికల సంఘం వెబ్‌సైట్, ఓటరు హెల్ప్ లైన్ నంబర్ 1950, ఎన్నికల పోలింగ్ తేదీ, సమయం వంటి వివరాలు ఉంటాయన్నారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీఎల్‌ఓ నుంచి ఓటర్ సమాచార చీటీ, ఓటర్ అవగాహన కరపత్రాన్ని కలెక్టర్ స్వీకరించారు.

నాచగిరి.. కార్తీక వ్రతసిరి

పోటెత్తిన భక్తులు..భారీగా వ్రతాలు



నాచగిరి గర్భగుడిలో స్వామివారు, అమ్మవారు

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లాలో సుప్రసిద్ధమైన నాచారం గుట్ట శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రం కార్తీక శోభ సంతరించుకుంది. శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలతో శోభిల్లింది. శివ కేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసంలో క్షేత్ర సందర్శన, వ్రతాలు జరిపించుకోవడం శుభకరంగా భావిస్తారు. దీంతో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు, ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు పోటెత్తారు. ఉదయమే క్షేత్రం చేరుకుని పుణ్య స్నానాలాచరించారు. దంపతులు వ్రతమండపం చేరుకొని భక్తిశ్రద్ధలతో కార్తీక సత్యనారాయణ స్వామి వ్రతమాచరించారు. గర్భగుడిలో శ్రీలక్ష్మీసమేతులైన నృసింహ స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.



నాచగిరిలో వ్రతమాచరిస్తున్న భక్తులు

బెస్ట్ ఆఫ్ లక్ ఇండియా

- నేడు భారత్–ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్
- గెలవాలని సిద్దిపేట క్రీడాకారుల ఆకాంక్ష

సిద్దిపేటజోన్: ఆదివారం అహ్మదాబాద్‌లో జరుగనున్న 13వ ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీ ఫైనల్‌లో విశ్వవిజేతగా టీమ్ ఇండియా నిలవాలని క్రీడాకారులు, క్రికెట్ అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. శనివారం సిద్దిపేట క్రికెట్ స్టేడియంలో క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెస్ట్ ఆఫ్ లక్ అంటూ భారత్ ఆటగాళ్లకు శుభాకాంక్షలు తెలిపారు. 1983, 2011 ప్రపంచ కప్ ఫలితాలను భారత్ పునరావృతం చేయాలని క్రీడాభిమానులు గట్టిగా కోరుకుంటున్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న వర్ధమాన క్రీడాకారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు..



ఇండియా విజయం సాధించాలని విక్టరీ సింబర్ చూపుతున్న సిద్దిపేట క్రీడాకారులు

ఇండియా గెలవాలి



నేడు జరగనున్న ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో ఇండియా జట్టు విజయం సాధించాలి. అన్ని మ్యాచ్‌లలో మెరుగ్గా ఆడుతున్న ఆటగాళ్లు అదే తరహాలో ఫైనల్ మ్యాచ్ బాగా ఆడాలి. –సిద్దు

సత్తా చాటాలి



ఇండియా జట్టులో విరాట్ కోహ్లీ ఆటతీరు బాగుంటుంది. నాకు విరాట్ బ్యాటింగ్ స్టైల్ ఇష్టం.. ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా జట్టు గెలిచి ప్రపంచానికి మన సత్తా చూపాలి. –హాసిని

దేవుళ్లను మొక్కుతున్న..



ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా జట్టు విజయం సాధించాలని దేవుళ్లను మొక్కుతున్న.. క్రికెట్ అభిమానులు అందరూ టీం ఇండియా విజయం కోసం ప్రార్థించాలి –సహస్ర

ఇండియానే మాకు స్ఫూర్తి



క్రికెట్ మీద ఇష్టంతో మూడేళ్లుగా బాగా ప్రాక్టీసు చేస్తున్న, ఎప్పటికైనా రంజీ ఆడాలని ఉంది. మా లాంటి వర్ధమాన క్రికెట్ క్రీడాకారులకు ఇండియా స్ఫూర్తిగా నిలవాలి. –ప్రియాన్షి

న్యూస్‌రీల్

బీజేపీ, కాంగ్రెస్‌లను తరిమికొట్టాలి

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి యజ్ఞంలో ప్రతిఒక్కరూ కలిసి రావాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గజ్వేల్‌లోని వైష్ణవీ గార్డెన్స్ లో నియోజకవర్గంలోని బీడీ టేకేదారులు కేసీఆర్ మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాన్ని ప్రతాప్‌రెడ్డికి అందజేశారు. గజ్వేల్‌లో కేసీఆర్‌కి లక్ష ఓట్ల మెజార్టీని అందించాలని పిలుపునిచ్చారు. బీజేపీ, కాంగ్రెస్‌లను తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం క్రిష్ణారెడ్డి, బీడీ టేకేదారుల సంఘం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న శ్రీహరిరావు

గజ్వేల్: రైతాంగ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని రైతు పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు విమర్శించారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రుణ మాఫీ సక్రమంగా అమలుకు నోచుకోక పోవడం వల్ల రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల హక్కులను కాపాడే పార్టీలకే ఈ ఎన్నికల్లో ఓటు వేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి: డీఈఓ



మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

నంగునూరు(సిద్దిపేట): చదువులో వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. నంగునూరు ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు డిజిట్ విద్యాబోధన, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. అలాగే, ఉదయం అల్పాహారంతోపాటు మధ్యాహ్నం భోజనం అందిస్తున్నామని, పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. సమావేశంలో హెచ్‌ఎం రామస్వామి, రవీందర్‌రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ వేముల రాజమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అదనపు సెలవు ప్రకటించాలి



మాట్లాడుతున్న రంగారావు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు అదనపు సెలవు ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి రంగారావు కోరారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నవంబర్ 29, 30 తేదీల్లో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు మరుసటి రోజు అదనపు సెలవు ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. పారదర్శకంగా పదోన్నతులు కల్పించి బదిలీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా నాయకులు రాచకొండ భూపాల్, మండల అధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి చందారాజేశం, అశోక్ పాల్గొన్నారు.

రూ. 2,72,450 నగదు సీజ్

వర్గల్(గజ్వేల్): ఎలాంటి ఆధారాలు లేకుండా స్కూటీలో తీసుకెళ్తున్న రూ.2,72,450 నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు వర్గల్ మండలం గౌరారం ఎస్సై విజయభాస్కర్ తెలిపారు. శనివారం గౌరారం వద్ద తమ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి స్కూటీ డిక్కీలో నగదు తీసుకెళ్తున్న పేర్కొన్నారు. వాటికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసి వర్గల్ ఎఫ్ఎస్‌టీ టీమ్‌కు అందజేశామన్నారు.

ధూంధాంగా ప్రజా ఆశీర్వాద సభ

- భారీగా తరలివచ్చిన జనం, పార్టీ శ్రేణులు
- పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు


సభలో కార్యకర్తల కేరింతలు


అభివాదం చేస్తున్న కేసీఆర్, పల్లా

చేర్యాల(సిద్దిపేట)/సిద్దిపేట కమాన్: ఊరూవాడా కదిలింది. జై తెలంగాణ అంటూ గులాబీ జెండా పట్టుకుని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభకు హాజరయ్యారు. తరలి వచ్చిన జనంతో జనగామ 'గులాబీ' పార్టీలో మరింత నూతనోత్తేజం నిండింది. సాధారణ ఎన్నికల నేపథ్యంలో శనివారం చేర్యాల పట్టణ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వెనుక గ్రౌండ్‌లో జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రజలనుద్దేశించి మాట్లాడారు. సభలోకి ప్రజలను మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రత్యేక మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేసి లోనికి అనుమతించారు. సభ వద్దకు 4.19నిమిషాలకు ప్రత్యేక కాన్వాయ్‌లో చేరుకున్న సీఎం కేసీఆర్ ప్రజలకు అభివాదం చేశారు. మిట్టపల్లి సురేందర్, ఇతర కళాకారుల బృందం తెలంగాణ ధూంధాం పాటలతో సభికులను ఉత్తేజ పరిచారు. సీఎం కేసీఆర్ సభ వద్దకు చేరుకోగానే ప్రజలు పెద్ద ఎత్తున జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు నాగపురి రాజలింగం, బోడకుంటి వెంకటేశ్వర్లు, జనగామ జిల్లా పరిషత్ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు, మున్సిపల్ చైర్ పర్సన్లు పోకల జమున, అంకుగారి స్వరూపరాణి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్లు బాల్డె సిద్దిలింగం, సుంకరి మల్లేశంగౌడ్, ఎంపీపీలు ఉల్లంపల్లి కరుణాకర్, బద్దిపడిగ కృష్ణారెడ్డి, తలారి కీర్తన, జెడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అనంతుల మల్లేశం, గీస బిక్షపతి, మంద యాదగిరి, మేక సంతోష్, మున్సిపల్ కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరెందర్, యాట కనకవ్వ, జుబేదా, పచ్చిమడ్ల సతీష్, కో–ఆప్షన్ సభ్యుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, రైతు బంధు జిల్లా సభ్యుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, రైతు బంధు మండల కోఆర్డినేటర్ తాడెం రంజిత, నాయకులు జల్లి సిద్దయ్య, ముస్త్యాల బాల్‌నర్సయ్య, ఉల్లెంగుల పద్మ ఏకానందం, మేర్గు శ్రీనివాస్, గదరాజు చందు, కోతి విజయ్, జింకల పర్వతాలు, శివగారి అంజయ్య, తాటికొండ సదానందం, కోతి దాసు, శనిగరం లక్ష్మణ్, పచ్చిమడ్ల సాయికిరణ్, కొంగరి గిరిదర్, రావుల ఉమేష్, యాట బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

- సభా ప్రాంగణం చుట్టూ ఏర్పాటు చేసిన ప్రభుత్వం సంక్షేమ పథకాల కటౌట్లు ఆకర్షణగా నిలిచాయి.
- జనగామ–సిద్దిపేట ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు చేపట్టారు.
- సీఎం కేసీఆర్ రోడ్డు మార్గం గుండా రావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అడుగడుగునా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టారు.
- 4.19ని.లకు సీఎం కేసీఆర్ సభా స్థలికి చేరుకున్నారు.
- 4.34ని.లకు సీఎం కేసీఆర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు.
- 42 నిమిషాల పాటు కొనసాగిన సీఎం కేసీఆర్ ప్రసంగం 5.16నిమిషాలకు ముగిసింది.
- సభలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ద్వారా ప్రజలు సీఎం ప్రసంగాన్ని ఆసక్తిగా తిలకించారు.
- సీఎం కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో తనదైన శైలిలో విసిరిన చలోక్తులకు ప్రజలు కేరింతలు కొట్టారు.
- 5.20నిమిషాలకు సీఎం కేసీఆర్ ప్రత్యేక కాన్వాయ్‌లో రోడ్డు మార్గం గుండా తిరిగి వెళ్లారు.
- ప్రసంగం ముగిసిన తర్వాత సుమారు అరగంట పాటు బాణాసంచాలు పేల్చి గులాబీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు.


గులాబీ జెండాలతో సభకు వినూత్నంగా వచ్చిన మనోహర్


సీఎం కేసీఆర్‌కు బొట్టుపెడుతున్న మహిళా నాయకురాలు


సీఎం కేసీఆర్‌తో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి


కారు గుర్తు జ్ఞాపికను అందిస్తున్న నాయకులు


కళాకారుల ఆటాపాట

నా ఎదుగుదలను ఓర్వలేక పోయారు: ఈటల

కొండపాక (గజ్వేల్): బీఆర్ఎస్‌లో తన ఎదుగుదలను చూసి ఓర్వలేకపోయారని, కేటీఆర్‌కు ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టేందుకు తనను బద్నాం చేసి బయటకు పంపారని బీజేపీ గజ్వేల్ అభ్యర్థి ఈటల రాజేందర్ ఆరోపించారు. తెలంగాణలో ఓట్ల పంచాయితీ, సీట్ల పంచాయితీ కోసం కాదని, కేవలం ఆత్మగౌరవ పంచాయితీ నడుస్తుందని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండల పరిధిలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నిజాం కాలం నాటి రాచరిక పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజలు ఆలోచించి తమ ఓటుతో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలుగా కొనసాగడమే కానీ వివిధ పనుల నిర్వహణపై ఎలాంటి హామీలిచ్చే ధైర్యం లేదని విమర్శించారు. వైద్యారోగ్య శాఖ మంత్రిగా పని చేస్తున్న హరీశ్‌రావు కోటా నిధులు వాడుకునే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. పదేళ్ల కాలంలో గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధికి కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఒకే ఇంట్లో రెండు పింఛన్లు పొందే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవండి

ములుగు(గజ్వేల్)/వర్గల్: తెలంగాణ ఇచ్చి న కాంగ్రెస్‌కు ప్రజలు మద్దతివ్వాలని గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రమైన ములుగులో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్త, నాయకులు తమ్మల శ్రీనివాస్, వెంకట్రాం రెడ్డి, మోహిన్, గణేష్‌యాదవ్, సహిమొద్దీన్, రవీందర్, రాజు, నర్సింలు, సంజీవ్‌లు, కొండల్‌రెడ్డి, రాములు, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొ న్నారు. అలాగే వర్గల్ మండలం నాచారం, అంతగిరిపల్లి, మాదారం, గిర్మాపూర్, శాకారంలో నర్సారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని జిల్లెలగడ్డ చెక్ పోస్టు వద్ద పోలీసులు శనివారం వాహనాలను తనిఖీ చేశారు. హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ తనయుడు ఇంద్రనీల్ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి లక్ష్మీనర్సింహస్వామి ఆటో యూనియన్ సభ్యులతో పాటు మండలంలోని వడ్లూరుకు చెందిన పలువురు శనివారం మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బెదిరింపు లేఖ

గజ్వేల్‌రూరల్: డబ్బుల కోసం గుర్తుతెలియని వ్యక్తి గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్ భర్తకు బెదిరింపు లేఖ పంపిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. గజ్వేల్ సీఐ జాన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని 11వ వార్డుకు చెందిన కౌన్సిలర్ గంగిశెట్టి చందన భర్త రవికి గుర్తు తెలియని వ్యక్తి డబ్బులను డిమాండ్ చేస్తూ బెదిరింపు లేఖను ఇంట్లో వేసినట్లు ఫిర్యాదు చేశారన్నారు. ఆ లేఖలో రూ. 5 లక్షల డబ్బులను ఇవ్వాలని.. లేకపోతే తనతో పాటు తన కుటుంబ సభ్యుల అంతు చూస్తానంటూ అందులో రాసి ఉందని రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెల్లడించారు.

అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపాలి

నంగునూరు(సిద్దిపేట): తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం దివాళా తీసిందని.. సిద్దిపేటలో హరీశ్‌రావును ఓడించి బీజేపీకి పట్టం కట్టాలని ఆపార్టీ సిద్దిపేట అభ్యర్థి దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం దర్గపల్లి, బద్దిపడగ, సిద్దన్నపేట, రాంపూర్, నంగునూరు, మగ్దుంపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు యాదమల్లు, తిరుపతిరావు, తిరుపతిరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, సతీష్, రవి, తిరుపతి, శ్రీనివాస్, స్వామి, వెంకట్‌రెడ్డి, కృష్ణమాచారి, తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే 6 గ్యారంటీలు

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని మానకొండూర్ కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపెల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని బెజ్జంకి క్రాసింగ్, దాచారం, ముత్తన్నపేట, చిలాపూర్, చిలాపూర్ పల్లె గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం తోటపల్లికి చెందిన మాజీ సహకార సంఘం చైర్మన్ బోయినిపెల్లి చందర్‌రావుతో పాటు పలు గ్రామాలకు చెందిన యువకులు కాంగ్రెస్‌లో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

హుస్నాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని హుస్నాబాద్ జూనియర్ మున్సిఫ్ కోర్టు జడ్జి శివరంజని అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

దుబ్బాక: ఈనెల 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని దుబ్బాక ఎన్నికల సాధారణ పరిశీలకుడు మన్మోహన్ ప్రసాద్ అన్నారు. శనివారం దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో దుబ్బాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి గరిమా అగ్రవాల్ ఆధ్వర్యంలో ఈ వీఎం రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈసందర్భంగా దుబ్బాక నియోజకవర్గంలో గల 253 పోలింగ్‌స్టేషన్‌లకు ఈవీఎంలను కేటాయించారు.

పాఠ్యాంశాలపై అవగాహన తప్పనిసరి

సిద్దిపేటజోన్: విద్యార్థులు బట్టి విధానాన్ని విడనాడి పాఠ్య అంశాలపై అవగాహన ఏర్పరుచుకోవడం ముఖ్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయమూర్తి రఘురాం సూచించారు. శనివారం స్థానిక రవీంద్ర హైస్కూల్‌లో లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ... పాఠ్య అంశంపై సంపూర్ణ అవగాహనతో పోటీ పరీక్షల్లో విజయం సాధించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. ఆడపిల్లలు 18 ఏళ్ల లోపు వివాహాలు చేసుకోవద్దని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

వచ్చేది కాంగ్రెస్ సర్కారే..

వర్గల్(గజ్వేల్): తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ సర్కారేనని ఆలిండియా పంచాయతీ రాజ్ సంఘటన్ కాంగ్రెస్ చైర్మన్ మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. శనివారం కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. రాష్ట్రం , కేంద్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే..

మద్దూరు(హుస్నాబాద్): బీఆర్ఎస్ నాయకులు ధన బలంతో అంగట్లో సరుకులా నాయకులను కొనుగోలు చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు గిరి కొండల్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని, అధికారంలో వచ్చేది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనని ఆరోపించారు. చేర్యాలను అభివృద్ధి పథంలో ముందుకు నడపడానికి తామందరం కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలకు పలువురు కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విచిత్రంగా ప్రచారం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్, మేడిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్‌కు మద్దతుగా శనివారం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ శర్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు కుల సంఘాలు బీఆర్ఎస్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆయన వెంట ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, వనిత, శ్రీనివాస్, గాజుల బాబు, సరిత, సదానందం గౌడ్, కనకరాజు ఉన్నారు.



సిద్దిపేటజోన్: పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థి హరీశ్‌రావు కు మద్దతుగా పార్టీ శ్రేణులు శనివారం ప్రచారం చేశారు. వ్యాపారులను, వివిధ కుల వృత్తుల వారిని కలిసి పనిలోపనిగా సాయం చేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. భరత్‌నగర్‌లో పానీపూరీ బండి వద్ద కట్లేట్ చేస్తూ పార్టీ కార్యకర్తలు ఓటు అభ్యర్థించారు.



ఏం చేశారని ఓట్లు అడుగుతున్నావ్...

- ఉన్న నిధులన్నీ సిద్దిపేటకే తరలించిన హరీశ్
- బీజేపీ దుబ్బాక అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు ధ్వజం


రఘునందన్‌రావుకు బోనాలు, బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న మహిళలు


దీపాయంపల్లిలో ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: దుబ్బాకకు న్యాయవరంగా రావాల్సిన నిధులు రాకుండా అడ్డుకున్న హరీశ్‌రావుకు ఈ ప్రాంత ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని దుబ్బాక బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు ఆరోపించారు. ఉన్న నిధులన్నీ సిద్దిపేటకే తరలించుకుపోయాడని విమర్శించారు. శనివారం పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, యువకులు రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. అలాగే ప్రచారంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేటలో కోమటిచెరువుకు పెట్టిన నిధుల్లో కనీసం సగమైనా దుబ్బాకకు ఇచ్చారా అని ప్రశ్నించారు. సిద్దిపేట, దుబ్బాక రెండు కళ్లు అని చెప్పే హరీశ్.. దుబ్బాకపై ఏ చేశాడో చెప్పాలన్నారు. దుబ్బాకపై తనకున్న ప్రేమ ఆయనకు ఎందుకుంటుందన్నారు. నియోజకవర్గంలో హరీశ్ ఎన్నిసార్లు తిరిగినా.. కొత్త డ్రామాలు మొదలు పెట్టినా ప్రజలు నమ్మవద్దన్నారు. హరీశ్ ఏదైనా ఉంటే సిద్దిపేటలో చూసుకోవాలని... పక్క నియోజకవర్గంపై పెత్తనం మానుకోకుంటే తాను సిద్దిపేటకు రావాల్సి ఉంటుందని హెచ్చరించారు.

అభివృద్ధి అంటే సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లనేనా..?

అభివృద్ధి అంటే కేవలం సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లనేనా.. మిగతా నియోజకవర్గాలను ఎందుకు పట్టించుకోవడం లేదో సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని రఘునందన్‌రావు ప్రశ్నించారు. కొడుకు, అల్లుడు ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గాలకే వేలాది కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. ఈ అవినీతి దగాకోరు కుటుంబపాలనకు ప్రజలు చరమగీతం పాడాలన్నారు.

రెండు సార్లు ఎంపీగా గెలిచి దుబ్బాకకు ఏం చేసిండు..?

రెండు సార్లు ఎంపీగా ఉన్న ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేసిండో ప్రజలు ఆలోచించాలన్నారు. ఏనాడైనా ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకున్నాడా... కేవలం గజ్వేల్, సిద్దిపేట నియోజకవర్గాలకే తన నిధులను ఇచ్చి దుబ్బాకకు చాలా అన్యాయం చేశాడని ఆరోపించారు. ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిస్తే ఏం అభివృద్ధి చేస్తాడో ప్రజలు ఆలోచించాలన్నారు. దుబ్బాక అభివృద్ధిపై అసెంబ్లీలో పదే పదే ప్రభుత్వాన్ని నిలదీస్తే తప్పనిసరి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరి చేసిందన్నారు.

చట్టం తెలిసిన వాడిని.. మీకు న్యాయం చేస్తా..

మీరెక్కడికి పోయినా దుబ్బాక అంటే రఘునందన్‌రావు మీ ఎమ్మెల్యే కదా.. మీరు చాలా గొప్పవారు, చైతన్యవంతులంటూ ప్రశంసలు వస్తున్నాయని చెప్పారు. తాను చట్టం తెలిసిన వాడిని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగంపై పూర్తి విశ్వాసం, విధేయత ఉంది.. మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

దుబ్బాకను రాష్ట్రంలోనే నంబర్ వన్ చేస్తా..

దుబ్బాకను రాష్ట్రంలోనే అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా అభివృద్ధి చేస్తానని రఘునందన్‌రావు ప్రజలకు భరోసానిచ్చారు. ఇప్పటికే నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో రోడ్లు, పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వంద పడకల ఆస్పత్రి, ఐటీఐ కళాశాల భవనం, ఐఓసీ భవనం, దుబ్బాక కొత్త బస్టాండ్‌తో పాటు అనేక పనులు వెనుకబడి ప్రభుత్వంతో కొట్లాడి పూర్తి చేయించిన విషయం ప్రజలు గమనించాలన్నారు.

కుటుంబపాలనకు ఓటుతో బుద్ధి చెప్పాలి

దౌల్తాబాద్: కుటుంబ పాలనకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. శనివారం మండలంలోని కోనాయిపల్లి, దీపాయంపల్లి, శేరిపల్లి బందారం, నర్సంపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.పదేళ్లు అధికారంలో ఉండి ఏం పని చేయని బీఆర్ఎస్ నాయకులు.. కేవలం మూడేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న తనపై విమర్శలు చేయడం హస్యాస్పదమన్నారు. పీఎం సడక్ యోజన పథకం కింద రోడ్ల అభివృద్ధికి కోట్ల నిధులు మంజూరి చేయించానన్నారు. ఎంపీ ఏం అభివృద్ధి చేశాడో వెల్లడించాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కిషన్, సర్పంచులు సురేందర్‌రెడ్డి, లావణ్య నర్సింహారెడ్డి, నాయకులు భూపాల్‌రెడ్డి, రామస్వామిగౌడ్, ప్రసాద్‌రావు, నర్సింలు ఉన్నారు.

దుబ్బాక గడ్డ.. బీజేపీ అడ్డా

దుబ్బాక: దుబ్బాక గడ్డ.. బీజేపీ అడ్డా అని, దుబ్బాకలో రఘునందన్‌రావు గెలుపు ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేష్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలో పలు వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సుభాష్ రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, నేహాల్ గౌడ్, నరేష్, రమణారెడ్డి, రమేష్‌రెడ్డి ఉన్నారు.

రామాయంపేటలో అభివృద్ధి ఏదీ?

రామాయంపేట(మెదక్): అభివృద్ధిలో రామాయంపేట పూర్తిగా అడుగంటి పోయిందని బీజేపీ దుబ్బాక అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. శనివారం రాత్రి బస్టాండు ఎదుట నిర్వహించిన రోడ్‌షోలో ఆ పార్టీ మెదక్ అభ్యర్థి పంజా విజయకుమార్‌తో కలిసి మాట్లాడారు. పదేళ్లలో కనీసం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేని దుస్థితిలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందని ఆరోపించారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా మద్యాన్ని మాత్రం అందరికీ అందుబాటులోకి తెచ్చారని విమర్శించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కరణం పరిమిత, శంకర్‌గౌడ్, పాల్గొన్నారు.

చేగుంటలో ఇంటింటి ప్రచారం

చేగుంట(తూప్రాన్): చేగుంటలో బీజేపీ దుబ్బాక అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా శనివారం ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండే రఘునందన్‌రావును మరోసారి గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో భూపాల్, గణేష్ రవికుమార్, సుజాత, లావణ్య, సాయిబాబా, మహేశ్, సాయిప్రసాద్ పాల్గొన్నారు.